# క్రొత్త నిబంధన-
# సంపూర్ణ క్షమాపణ

> సహోదరులారా, యేసు మనకొరకు ప్రతిష్ఠించిన మార్గమున, అనగా నూతనమైనదియు, జీవముగలదియు, ఆయన శరీరము అను తెరద్వారా యేర్పరచబడినదియునైన మార్గమున, ఆయన రక్తమువలన పరిశుద్ధస్థలమునందు ప్రవేశించుటకు మనకు ధైర్యము కలిగియున్నది గనుకను, దేవుని యింటిపైన మనకు గొప్ప యాజకుడున్నాడు గనుకను, మనస్సాక్షికి కల్మషము తోచకుండునట్లు ప్రోక్షింపబడిన హృదయములు గలవారమును, నిర్మలమైన ఉదకముతో స్నానముచేసిన శరీరములు గలవారమునై యుండి, విశ్వాస విషయములో సంపూర్ణ నిశ్చయత కలిగి, యథార్థమైన హృదయముతో మనము దేవుని సన్నిధానమునకు చేరుదము (హెబ్రీ. 10:19-22).

సీనాయి పర్వతము వద్ద ధర్మశాస్త్రం యివ్వక ముందు బైబిల్లో పాపక్షమాపణను గూర్చి కొద్దిగా మాత్రమే చెప్పబడింది. ఏదియెలాగున్నా, బలులు అర్పించబడ్డాయి; అయినా ఆ బలుల యొక్క నిజమైన ఉద్దేశం బయలుపరచబడలేదు. కయీను, హేబెలుల అర్పణలు (ఆది. 4:3, 4) పాప పరిహారార్థానికి సంబంధించినవై ఉండవచ్చు. లేక అవి కృతజ్ఞతార్పణలో లేక యిష్ట పూర్వకమైన అర్పణలై కూడా ఉండవచ్చు (లేవీయ. 7:12, 16). నోవహు (ఆది. 8:20), అబ్రాహాము (ఆది. 22:13) యాకోబు (ఆది. 31:54; 46:1), మరియు యిత్రో (నిర్గమ. 18:12) లు అర్పించిన దహన బలులు పాప పరిహారార్థ బలులు కాకపోవచ్చు. అయితే యోబు తన కుమారుల పక్షంగా అర్పించినవి పాప పరిహారార్థ బలులని మనకు తెలుసు (యోబు 1:5).

## ధర్మశాస్త్రం క్రింద పాపక్షమాపణ

ధర్మశాస్త్రం క్రింద నీచంగా జరిగించిన పాపాలు మరణ దండనతో శిక్షింపబడ్డాయి.

> అయితే దేశమందు పుట్టినవాడేగాని పరదేశియేగాని యెవడైనను సాహసించి పాపముచేసిన యెడల వాడు యెహోవాను తృణీకరించినవాడగును గనుక అట్టివాడు నిశ్చయముగా జనులలో నుండకుండ కొట్టివేయబడును; వాడు యెహోవా మాటను అలక్ష్యము చేసి ఆయన ఆజ్ఞను మీరినందున నిశ్చయముగా కొట్టివేయబడును; వాని దోషశిక్షకు వాడే కారకుడు (సంఖ్యా. 15:30, 31).

"ఎవడైనను మోషే ధర్మశాస్త్రమును నిరాకరించినయెడల ఇద్దరు ముగ్గురు సాక్షుల మాటమీద, కనికరింపకుండ వాని చంపించుదురు" అని మనం చదువుతాం (హెబ్రీ. 10:28). నిరాకరించిన వానికి ఏ కనికరమూ చూపేది లేదు. శిక్షనుండి ఆ వ్యక్తిని

విడిపించడానికి చెల్లింపబడేది ఏదీ ఉండదు. హంతకుని శిక్షను గూర్చి ధర్మశాస్త్రం యిలా తెలియజేసింది: "చావతగిన నరహంతకుని ప్రాణముకొరకు మీరు విమోచన ధనమును అంగీకరింపక నిశ్చయముగా వానికి మరణశిక్ష విధింపవలెను" (సంఖ్యా. 35:31).

## పాపము కొరకైన బలి

సంఖ్యాకాండము 15 ప్రకారం, పొరబాటున పాపము చేసినవారు క్షమింపబడడానికి బలి అర్పించవలసి యుంటుంది. దేవుడు వారికి యిలా సెలవిచ్చాడు,

> యెహోవా మోషేతో చెప్పిన యీ ఆజ్ఞలన్నిటిలో, అనగా యెహోవా ఆజ్ఞాపించిన దినము మొదలుకొని అటుపైని మీ తరములకు యెహోవా మోషే ద్వారా మీకు ఆజ్ఞాపించినవాటిలో పొరబాటున దేనినైనను మీరు చేయకపోయినప్పుడు, అది సమాజమునకు తెలియబడని యెడల సర్వసమాజము యెహోవాకు ఇంపైన సువాసనగా నుండుటకై దహనబలిగా ఒక కోడెదూడను, విధిచొప్పున దాని నైవేద్యమును దాని పానీయార్పణమును పాప పరిహారార్థబలిగా ఒక మేకపిల్లను సిద్ధపరచవలెను. యాజకుడు ఇశ్రాయేలీయుల సర్వసమాజము నిమిత్తము ప్రాయశ్చిత్తము చేయవలెను; తెలియకయే దాని చేసెను గనుక క్షమింపబడును. వారి పొరబాటున చేసిన పాపములను బట్టి తమ అర్పణమును, అనగా యెహోవాకు చెందవలసిన హోమమును పాప పరిహారార్థబలిని యెహోవా సన్నిధికి తీసికొని రావలెను. అప్పుడు ఇశ్రాయేలీయుల సర్వసమాజమేమి, వారి దేశమందు నివసించు పరదేశి యేమి క్షమాపణ నొందును; ఏలయనగా ప్రజలందరు తెలియకయే దాని చేయుట తటస్థించెను. ఒకడు పొరబాటున పాపము చేసినయెడల వాడు పాప పరిహారార్థ బలిగా ఏడాది ఆడుమేకపిల్లను తీసికొని రావలెను. పొరబాటున యెహోవా సన్నిధిని దాని చేసెను గనుక తెలియకయే పాపము చేసిన వాని నిమిత్తము యాజకుడు ప్రాయశ్చిత్తము చేయును; వాని నిమిత్తము ప్రాయశ్చిత్తము చేయుటవలన వాడు క్షమాపణనొందును (22–28 వచ.).

పాప పరిహారార్థ బలులను గూర్చిన, దోషానికి సంబంధించిన బలులను గూర్చిన చట్టాలు లేవీయకాండం 4:1–7:10వరకు ఎక్కువ వివరంగా యివ్వబడ్డాయి. పాపము కొరకైన అర్పణ చెల్లింపబడిన తరువాత, పాపము చేసినవాడు "క్షమింపబడునని" దేవుడు అభయమిచ్చాడు (లేవీయ. 4:20, 26, 31, 35; 5:10, 13, 16, 18; 6:7; 19:22). పాపాలు క్షమింపబడినా, జంతువుల రక్తాన్నిబట్టి అవి క్షమించబడలేదు. మొదటి నిబంధన కాలంలో జరిగిన అపరాధములను క్షమించింది ప్రభువైన యేసు యొక్క సిలువ మరణమే (రోమా 3:25; హెబ్రీ. 9:15).

## ఎడ్ల యొక్కయు మేకల యొక్కయు రక్తం

"ఎడ్లయొక్కయు మేకలయొక్కయు రక్తము పాపములను తీసివేయుట అసాధ్యము" అని క్రొత్త నిబంధన స్పష్టంగా చెప్తుతుంది (హెబ్రీ. 10:4). జంతువుల రక్తము పాపములను తీసివేయుట అసాధ్యమైనట్లయితే, "… వారికి క్షమాపణ కలుగును" అనే ధర్మశాస్త్రం యొక్క ప్రతిపాదన (ఉదాహరణకు, లేవీయ. 4:20, 26, 30, 35 చూడు) అప్పుడు పాపములు క్షమింపబడలేదు గాని తరువాత కాలంలో క్షమింపబడతాయనే సంగతి గుప్తం చేయబడిందా?

ఆ కాలంలో దేవుడు పాపాలు క్షమించినట్టు కొన్ని పాత నిబంధన ప్రతిపాదనలు స్పష్టంగా బోధిస్తున్నాయి. మోషే యొక్క ప్రార్థన, దానికి మహోన్నతుని యొక్క జవాబు – సిలువకు ముందే దేవుడు పాపములను క్షమించాడని సూచిస్తున్నాయి. "ఐగుప్తులోనుండి వచ్చినది మొదలుకొని యిదివరకు నీవు ఈ ప్రజలదోషమును పరిహరించియున్నట్లు నీ కృపాతిశయమునుబట్టి ఈ ప్రజలదోషమును దయచేసి క్షమించుమని యెహోవాతో చెప్పగా, యెహోవా – 'నీ మాట చొప్పున నేను క్షమించియున్నాను' " (సంఖ్యా. 14:19, 20). దావీదు బత్షెబతో పాపము చేసిన తరువాత, "నాతాను – నీవు చావకుండునట్లు యెహోవా నీ పాపమును పరిహరించెను" అని తెలిపాడు (2 సమూ. 12:13బి). సొలొమోను ద్వారా దేవుడు యిలా అన్నాడు: "నా పేరు పెట్టబడిన నా జనులు తమ్ము తాము తగ్గించుకొని ప్రార్థనచేసి నన్ను వెదకి తమ చెడుమార్గములను విడిచిన యెడల, ఆకాశమునుండి నేను వారి ప్రార్థనను విని, వారి పాపమును క్షమించి, వారి దేశమును స్వస్థపరచుదును" (2 దినవృ. 7:14).

పాత నిబంధన కాలంలో దేవుడు ప్రజలను క్షమించినట్టు రుజువులు కన్పిస్తున్నాయి. ప్రభువైన యేసుయొక్క మరణాన్ని ఆధారం చేసికొని ఆయన క్షమించినట్టున్నాడు. ఎలాగంటే, ఆ సంఘటన తరువాత అది ఎంత నిశ్చయమో, దేవునికి ఆ సంఘటన జరుగక ముందును అంతే నిశ్చయంగా ఉంటుంది. క్రీస్తు యొక్క మరణం విమోచనగా ఉండడానికి దేవుడు ముందుగానే సంకల్పించి యుంచాడు (యెషయా 53:4-12; అపొ. 2:23), అది సృష్టికి ముందే జరిగింది (1 పేతురు 1:18-20).

ప్రభువైన యేసు యొక్క మరణం ద్వారా, గత పాపాలను క్షమించడంలో తాను న్యాయవంతుడనై ఉన్నట్టు దేవుడు కనుపరచాడు: "పూర్వము చేయబడిన పాపములను దేవుడు తన ఓరిమివలన ఉపేక్షించినందున, ఆయన తన నీతిని కనుపరచవలెనని" (రోమా 3:25బి) ఉద్దేశించాడు. క్రీస్తు మరణం క్రొత్త నిబంధన క్రిందనున్నవారిని క్షమించడం మాత్రమే గాక, పాత నిబంధన క్రిందనున్నవారిని క్షమించడానికి కూడా ఆధారమైయుంది. అందును బట్టి, ఇశ్రాయేలీయులు సహితం ధర్మశాస్త్రం వాగ్దానం చేయని నిత్య స్వాస్థ్యమును కూడ పొందగలరు. "ఈ హేతువుచేత మొదటి నిబంధన కాలములో జరిగిన అపరాధముల నుండి విమోచనము కలుగుటకై ఆయన మరణము పొందినందున, పిలువబడినవారు నిత్యమైన స్వాస్థ్యమునుగూర్చిన వాగ్దానమును పొందు నిమిత్తము ఆయన క్రొత్త నిబంధనకు మధ్యవర్తియై యున్నాడు" (హెబ్రీ. 9:15).

వ్యక్తిగతమైన యోగ్యతను బట్టిగాని, లేక వారు అర్పించు బలులవలన గాని గాక, సర్వలోక పాపమునకు శాంతికరమైన క్రీస్తు రక్తాన్ని ఆధారం చేసికొని (1 యోహాను 2:2) దేవుడు ఇశ్రాయేలు యొక్క పాపాలను క్షమించాడు. అన్ని యుగములలోను, పాపక్షమాపణ అనేది క్రీస్తు రక్తం యొక్క ఆధారం మీదనే జరుగుతుంది. "రక్తము చిందింపకుండ పాపక్షమాపణ కలుగదనియు సామాన్యముగా చెప్పవచ్చును" (హెబ్రీ. 9:22బి) క్రీస్తు రక్తం మాత్రమే పాపక్షమాపణకు ఆధారమైయుంటుంది.

## క్రొత్త నిబంధన క్రింద పాపక్షమాపణ

పాపము, దేవుని స్వభావానికి సంపూర్ణంగా విరోధమైయుండి, అది, ఆయన అయిష్టాన్ని పురికొల్పుతుంది:

> దుర్నీతిచేత సత్యమును అడ్డగించు మనుష్యుల యొక్క సమస్త భక్తిహీనతమీదను, దుర్నీతిమీదను దేవుని కోపము పరలోకమునుండి బయలుపరచబడుచున్నది (రోమా 1:18).
>
> వ్యభిచారియైనను, అపవిత్రుడైనను, విగ్రహారాధకుడైయున్న లోభియైనను క్రీస్తుయొక్కయు దేవునియొక్కయు రాజ్యమునకు హక్కుదారుడు కాడను సంగతి మీకు నిశ్చయముగా తెలియును.
>
> వ్యర్థమైన మాటలవలన ఎవడును మిమ్మును మోసపరచ నియ్యకుడి; ఇట్టి క్రియలవలన దేవుని ఉగ్రత అవిధేయులైనవారిమీదికి వచ్చును ... (ఎఫెసీ. 5:5, 6). కావున భూమిమీదనున్న మీ అవయవములను, అనగా జారత్వమును,
>
> అపవిత్రతను, కామాతురతను, దురాశను, విగ్రహారాధనయైన ధనాపేక్షను చంపి వేయుడి. వాటివలన దేవుని ఉగ్రత అవిధేయుల మీదికి వచ్చును (కొలస్సీ. 3:5, 6).

ప్రభువైన యేసు దుర్నీతిని ద్వేషిస్తున్నందున (హెబ్రీ. 1:9), దానిపై దేవుడు ఉగ్రతను కుమ్మరిస్తాడు. ఎందుకంటె అది దేవుని దృష్టిలో పాపమైయుంది (1 యోహాను 3:4).

పాపము దేవుని ఉగ్రతను ఎదుర్కొనడం మాత్రమేగాక, మనలను ఆయననుండి వేరుచేసి ఆయనకు దూరస్థులనుగా చేస్తుంది. పౌలు యిలా వ్రాశాడు: "మరియు గతకాలమందు దేవునికి దూరస్థులును, మీ దుష్క్రియలవలన మీ మనస్సులో విరోధ భావముగలవారునై యుండిన మిమ్మును" (కొలస్సీ. 1:21). "అంధకారమైన మనస్సు గలవారై, తమ హృదయ కాఠిన్యమువలన తమలోనున్న అజ్ఞానముచేత దేవునివలన కలుగు జీవములోనుండి వేరుపరచబడినవారై, తమ మనస్సునకు కలిగిన వ్యర్థత అనుసరించి నడుచుకొనుచున్న" క్షమాపణలేని పాపులు కూడా మినహాయించబడ్డారు (ఎఫెసీ. 4:18). "వారు లోకమందు దేవుడు లేనివారునైయుండి, క్రీస్తునకు దూరస్థులై ... శత్రువులునై" (ఎఫెసీ. 2:12, 13; రోమా 5:10) యున్నారు. "యీ లోకస్నేహము దేవునితో వైరమని" యాకోబు కూడా తెలిపాడు (యాకోబు 4:4బి).

### మన క్షమాపణ కొరకు క్రీస్తు బలి

నరుని క్రియలుగాని, ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలుగాని పాపమును లేక దేవుని ఉగ్రతను తొలిగించలేవు. ఒకవేళ అదే సాధ్యమైయుండినట్లయితే, ప్రభువైన యేసు సిలువపై మరణించవలసిన అవసరం ఉండేది కాదు. పౌలు యిలా వ్రాశాడు: "నేను దేవుని కృపను నిరర్థకము చేయను; నీతి ధర్మశాస్త్రమువలననైతే ఆ పక్షమందు క్రీస్తు చనిపోయినది నిష్ప్రయోజనమే" (గలతీ. 2:21). "ధర్మశాస్త్రము విధించిన క్రియలకు సంబంధులందరు శాపమునకు లోనైయున్నారు" అని కూడా అతడు అన్నాడు (గలతీ.

3:10ఎ). బుద్ధిపూర్వకమైన ఏ తప్పిదమును ధర్మశాస్త్రం అనుమతించలేదు, అది ఏ రకమైన కనికరమును కూడా చూపలేదు (గలతీ. 5:4; హెబ్రీ. 10:28). ఇవన్నీ క్రీస్తు రక్తంవలననే అనుగ్రహించబడ్డాయి. మనుష్యుడు చేయగలిగినదేదియు పాపాన్ని క్షమింపలేదు. "నా పాపాన్ని కడిగివేయగలిగిందేది? యేసు రక్తంగాక మరేది లేదు" అని ఒక ప్రాచీన కాలపు పాట చెప్పుతుంది.[1] క్రీస్తు రక్తం మాత్రమే పాపాన్ని తీసివేయగలదు; అయినా, మన పక్షంగా సరియైన విధేయత లేని పక్షంలో మనం శుద్ధీకరింపబడలేం.

యేసు రక్తం ద్వారా మన పాపాలు క్షమించబడతాయి (మత్తయి 26:28; 1 యోహాను 1:7; ప్రకటన 1:5). నూతనమైన సజీవమైన మార్గం ద్వారానే యిది జరుగుతుంది (హెబ్రీ. 10:19, 20). రక్తం చిందించడంలో, ప్రభువు మన పాప రుణాన్ని చెల్లించారు (రోమా 6:23; 1 పేతురు 1:18–20) అందును బట్టి దేవుని ఉగ్రత తొలిగిపోయేలా ఆయన చేశారు. "కాబట్టి ఆయన రక్తమువలన ఇప్పుడు నీతిమంతులముగా తీర్చబడి, మరింత నిశ్చయముగా ఆయనద్వారా ఉగ్రతనుండి రక్షింపబడుదుము" (రోమా 5:9). దేవునికిని మనకును మధ్య సమాధానాన్ని కూడ ఆయన రక్తం సాధ్యం చేస్తుంది (కొలస్సీ. 1:20). దీన్నిబట్టి ఆయన "సన్నిధిని పరిశుద్ధులుగాను నిర్దోషులుగాను నిరపరాధులు గాను" నిలువబెట్టబడతాం (కొలస్సీ. 1:22). "కావున యేసు కూడ తన స్వరక్తముచేత ప్రజలను పరిశుద్ధపరచుటకై గవిని వెలుపట శ్రమపొందెను" (హెబ్రీ. 13:12).

### విధేయతతో కూడిన మన ప్రత్యుత్తరం

క్రీస్తు రక్తం మాత్రమే మన రక్షణను సాధ్యం చేయగలదు (అపొ. 4:12). ఆయన సాధ్యపరచిన ఆత్మ సంబంధమైన జీవాన్ని పొందడానికిగాను, మన నమ్మిక ఆయనయందు ఉండి తీరాలి. ఆయనకు లోబడి ఆయనను అనుసరించి తీరాలి. "కుమారునియందు విశ్వాసముంచువాడే నిత్య జీవముగలవాడు, కుమారునికి విధేయుడు కానివాడు జీవము చూడడు గాని దేవుని ఉగ్రత వానిమీద నిలిచియుండును" అని యోహాను 3:36 అంటుంది. ఈ వచనం యొక్క తర్జుమా చాలా కరక్టుగా ఉంది. ఇక్కడ ఉపయోగింపబడిన పదం *apeitheo* అంటే "విధేయుడు కానివాడు" అని అర్థం; ఈ వచనంలో *apisteo* అనే పదం లేదు – అంటే "విశ్వసింపనివాడు" అని అర్థం.

ప్రభువైన యేసు, "సంపూర్ణ సిద్ధి పొందినవాడై … తనకు విధేయులైన వారికందరికి నిత్య రక్షణకు కారకుడాయెను" (హెబ్రీ. 5:9). క్రీస్తు ప్రభువు ఎన్నడు అపరిపూర్ణుడు కాడు. "సంపూర్ణ సిద్ధి" అనే పదం *teleios* అనే దానినుండి వచ్చింది, "దాని అంతమునకు చేరినవాడై, సంపూర్ణుడైనవాడు" అని అర్థం. తన రక్తం చిందించడంతో, మనుష్యులను రక్షించే తన పని ముగించబడింది, సమాప్తమయ్యింది (యోహాను 19:30). మన రక్షణ కొరకైన విలువను చెల్లించి, తనకు విధేయులైన వారి రక్షణకు ఆయన మూలమై లేక ఆధారమై నిలిచాడు. క్షమాపణ అంతా క్రీస్తు రక్తం మీద అధారపడి ఉంది. వేరే విధంగా అది సాధ్యపడదు. ఎందుకంటె, "రక్తము చిందింపకుండ పాపక్షమాపణ కలుగదు" (హెబ్రీ. 9:22).

మనం చేయగలిగేది ఏదీ రక్షణను ఉత్పత్తి చేయలేదు. దానికి బదులు తాను సంపాదించిన రక్షణను తనకు విధేయులైనవారికి క్రీస్తు ప్రభువు ప్రసాదిస్తాడు. మనం విశ్వాసం ద్వారా కృపచేతనే రక్షింపబడియున్నాం – అనర్హులైనవారికి దేవుడు కనుపరచిన ఉపకారంవలననేగాని అది క్రియలవలన కలిగినది కాదు, ప్రభువైన యేసు చేసిన క్రియవలన కలిగింది (ఎఫెసీ. 2:8, 9). క్రీస్తు యొక్క చిత్తానికి లోబడడంవలన, తన సిలువ మరణమునందు ఆయన చిందించిన రక్తం ద్వారా ఏర్పరచబడిన లేక అనుగ్రహించిన రక్షణను మనం పొందుతున్నాం. ఇదే సువార్త. ప్రభువైన యేసుకు లోబడనివారు – సువార్తకు లోబడరు – గనుక ప్రభువు యొక్క సముఖమునుండి పారద్రోలబడినవారై నిత్య నాశనమను దండన పొందుదురు (2 థెస్స. 1:8, 9).

యేసు రక్తమందలి మన విశ్వాసం ద్వారా (హెబ్రీ. 5:9; రోమా 3:25), కరుణా పీఠము వద్ద దేవుడు మనలను కలిసికొని మనలను శుద్ధీకరించునట్లు, క్రీస్తు మనకు శాంతికరమై యున్నాడు. ప్రభువైన యేసు మనకొరకు చేసిన దానియందు మనం మన విశ్వాసాన్ని నిలపాలి. అంతేగాని, సొంతగా మనం దేవుని కొరకు ఏమి చేయగలమో అనేదాని మీద కాదు. మనం విశ్వాసం ద్వారా కృపచేతనే రక్షింపబడ్డాం (ఎఫెసీ. 2:8, 9). "విశ్వాసము వలన ఈ కృపయందు ప్రవేశముగలవారమై" యున్నాం (రోమా 5:2).

ఏదియెలాగున్నా, దేవుడు దీవించె విశ్వాసం, దేవుని చిత్తానికి విధేయతగా ప్రత్యుత్తర మిచ్చే విశ్వాసమైయుండాలి. క్రొత్త నిబంధన క్రింద, దేవుడు కోరే విశ్వాసపు ప్రత్యుత్తరమందు మారుమనస్సు (అపొ. 17:30), క్రీస్తునందలి మన విశ్వాసపు ఒప్పుకోలు (రోమా 10:9, 10), మరియు బాప్తిస్మము (మార్కు 16:15, 16; అపొ. 2:38; 22:16; కొలస్సీ. 2:12, 13; 1 పేతురు 3:21) అనేవి చేర్చబడ్డాయి.

మననుండి ప్రభువు కోరేది ఏదీ పాపాన్ని తీసివేయలేదు. క్రీస్తు రక్తం మాత్రమే ఆ పని చేయగలదు. అయినా, మనం ఆయనకు లోబడకుండ, ప్రభువు మన పాపాలను తుడిచి వేయదు. చుట్టు ప్రదక్షిణం, కేకలు వేయడం, బూరలు ఊదడం అనే వాటితో ఎరికో గోడలు కూలనట్టే (హెబ్రీ. 11:30), మన విశ్వాసం, మారుమనస్సు, ఒప్పుకొనడం, బాప్తిస్మం అనేవి మన పాపాన్ని తీసివేయడానికి చాలినవి కావు. దేవుడు కోరిన దానికి ప్రత్యుత్తరంగా వారి విశ్వాసము వారికి ఉద్దేశాన్ని కలిగించింది, మరియు వారు క్రియ జరిగించినప్పుడు బహుమానం పొందారు. అదే విధంగా, మనం మారుమనస్సు పొంది, ఒప్పుకొని, బాప్తిస్మం పొందినప్పుడు, మన విశ్వాసము బహుకరించబడుతుంది. దేవుని చిత్తానికి మనం లోబడినప్పుడు, ఆయన జరిగించేది మనకు రక్షణ కలిగిస్తుందనే విశ్వాసం ఉంది. మన విశ్వాసము మన సొంత క్రియలలో కాదు. పౌలు యిలా అన్నాడు:

> మీరును, క్రీస్తు సున్నతియందు, శరీరేచ్ఛలతో కూడిన స్వభావమును విసర్జించి ఆయనయందు చేతులతో చేయబడని సున్నతి పొందితిరి. మీరు బాప్తిస్మమందు ఆయనతో కూడ పాతిపెట్టబడినవారై ఆయనను మృతులలోనుండి లేపిన దేవుని ప్రభావమందు విశ్వసించుట ద్వారా ఆయనతో కూడ లేచితిరి. మరియు అపరాధముల వలనను శరీరమందు సున్నతిపొందక యుండుటవలనను, మీరు మృతులైయుండగా, ... మన అపరాధముల నన్నిటిని క్షమించి, ఆయనతో కూడ మిమ్మును జీవింపచేసెను (కొలస్సీ. 2:11–13).

మనం ప్రభువుతో సమాధి చేయబడినప్పుడు, మన విశ్వాసము "దేవుడు చేసే పని" మీద ఉండాలి. మృతులలోనుండి ప్రభువును లేపినప్పుడు, దేవుడు మరణంలోనుండి జీవంలోనికి ఆయనను తెచ్చిన దేవుని శక్తి ప్రదర్శింపబడింది. మృతులలోనుండి యేసును లేపుటకు దేవుడు చేసిన కార్యాన్ని ఆధారం చేసికొని, మనం బాప్తిస్మం పొందినప్పుడు మనలను నూతన జీవంలోనికి తెచ్చే ఆయన శక్తియందు నమ్మిక కలిగియుండాలి. బాప్తిస్మమందు, ఆత్మ సంబంధమైన మరణంనుండి జీవములోనికి తెస్తానని దేవుడు వాగ్దానం చేసినందున, ఆయన పని మనలను ఆత్మ సంబంధంగా జీవించువారంగా చేస్తుంది. మనం బాప్తిస్మం పొందునప్పుడు, దేవుడు ఏమి చేస్తున్నాడో దానియందు మనం విశ్వాసం ఉంచాలేగాని, మనం ఏమి చేస్తున్నామో దానియందు విశ్వసింపకూడదు. ఈ అవసరతను మనం నెరవేర్చినప్పుడు. దేవుడు మన పాపములన్నిటిని క్షమించి, మనకు నిత్య జీవమనుగ్రహిస్తాడు.

యేసు రక్తమునందును, పాపక్షమాపణ నూతన జీవాన్ని ప్రసాదించడానికి గాను దేవుని శక్తియందును మనం విశ్వాసం ఉంచడం మాత్రమే మనం కోరబడలేదు; దానికి మించి, క్రీస్తునందు మనం నూతన జీవం కలిగి బ్రదుకునట్లు, మన గత జీవితం విషయంలో మృతులై ఉండాలని కూడా కోరబడ్డాం. ప్రభువుతో బాప్తిస్మమందు మనం పాతిపెట్టబడినప్పుడు (ఆ సమయంలో) మన గత జీవితం విషయంలో మృతులమై యుండి, అప్పటినుండి నూతన జీవం పొందినవారమై నడుచుకొంటాం (రోమా 6:4). మనం ఏ ఉపదేశ క్రమమునకు అప్పగింపబడితిమో, దానికి హృదయ పూర్వకముగా లోబడినవారమైనప్పుడు (రోమా 6:17, 18), మన ప్రాచీన పురుషుడు క్రీస్తుతో కూడ "సిలువ వేయబడతాడు." "పాపశరీరము నిరర్థకమగునట్లు, మన ప్రాచీన స్వభావము ఆయనతో కూడ సిలువ వేయ"బడాలని దేవుడు తన సంకల్పాన్ని చిత్రించాడు (రోమా 6:6).

బయలుపరచబడిన క్రీస్తు ప్రభువు యొక్క వాక్యమునుండి నేర్చుకొనిన దానిమీద మన విశ్వాసం ఆధారపడాలి (రోమా 10:17). అపొస్తలుల వాక్యము ద్వారా మనం ఆయనయందు విశ్వాసముంచాలని ప్రభువు సెలవిచ్చాడు (యోహాను 17:20). దీనికి ఉదాహరణగా, ఘనులైన బెరయ పట్టణస్థులున్నారు. వారు "ఆసక్తితో వాక్యమును అంగీకరించి, పౌలును సీలయును చెప్పిన సంగతులు ఆలాగున్నవో లేవో అని ప్రతి దినమును లేఖనములు పరిశోధించుచు వచ్చిరి. అందుచేత వారిలో అనేకులును, ఘనతగల గ్రీసుదేశస్థులైన స్త్రీలలోను పురుషులలోను చాలమందియు విశ్వసించిరి" (అపొ. 17:11, 12).

### క్రీస్తునందు నూతన పురుషుడు

మనము ఆయనలోనికి బాప్తిస్మం పొందినప్పుడు, నూతన సృష్టిగా చేయబడతాం (రోమా 6:3; గలతీ. 3:27; 2 కొరింథీ. 5:17). క్రీస్తులో ఉన్నవారు క్రీస్తు యొక్క ఒకే శరీరమైన (రోమా 12:5) సంఘంలో ఉంటారు (ఎఫెసీ. 1:22, 23; కొలస్సీ. 1:18, 24). బాప్తిస్మం మనలను ఆ ఒక్క శరీరంలోని అవయవములుగా చేస్తుంది (1 కొరింథీ. 12:13, 27).

నీటి మూలముగాను ఆత్మ మూలముగాను మనము జన్మింపకుంటె, దేవుని రాజ్యములో ప్రవేశింపలేము (యోహాను 3:5). క్రొత్తగా జన్మించినవారు "ప్రథమ ఫలమైయుండి," క్రీస్తు శరీరమైన సంఘముగా రూపొందుతారు (హెబ్రీ. 12:23; ఎఫెసీ. 1:22, 23; కొలస్సీ. 1:18, 24). (ప్రథమ ఫలము యాకోబు 1:18; జ్యేష్ఠులు అనేది ఒక్కటే హెబ్రీ. 12:23). వారు క్రీస్తు రాజ్యములో పౌరులైయున్నారు (ఎఫెసీ. 2:19; కొలస్సీ. 1:13). ఈ క్రొత్త సృష్టి ఆయన నిర్మించిన (మత్తయి 16:18) క్రీస్తు సంఘమై యుండి ఆయనకు లోబడియుంటారు (ఎఫెసీ. 5:24). సంఘము యొక్క సభ్యులు క్రీస్తుచేత ప్రేమింపబడతారు (ఎఫెసీ. 5:25), ఒకనాడు వారిని ఆయన తన ఎదుట నిలబెట్టుకుంటాడు. కళంకమైనను ముడుతయైనను అట్టిది మరేదైనను లేక పరిశుద్ధులు గాను నిర్దోషులుగాను (ఎఫెసీ. 5:27) ఆయన తన రక్త ప్రభావంవలన (కొలస్సీ. 1:20) వారిని తీర్చి దిద్దుతాడు.

## ముగింపు

మోషే ద్వారా అనుగ్రహింపబడిన ధర్మశాస్త్రం క్రింద కోరబడినవాటికి భిన్నమైనవి పాపక్షమాపణ కొరకు క్రొత్త నిబంధనలో కోరబడ్డాయి. వారి క్షమాపణకు ఇశ్రాయేలీయులు జంతు బలి రక్తాన్ని గురుతుగా ఉపయోగించారు. అయితే పాపాలు క్షమించేదానికి ఆధారం క్రీస్తు రక్తం మాత్రమే. అలాగే, మనం మన విశ్వాసాన్ని ఆయన రక్తం మీద నిలిపి, నేటి ప్రజలకొరకు ఆయన నియమించిన విధులకు లోబడినప్పుడు, క్రొత్త నిబంధన క్రింద క్రైస్తవులైనవారికి ఆయన రక్తం పాపక్షమాపణ ప్రసాదిస్తుంది.

ఈ ఆవశ్యకతలను సంధించడానికిగాను మన పాప మార్గాలను మార్చుకొనడానికి తీర్మానించుకొని, ఆయన కొరకు జీవించగోరి, ఆయనయందలి మన విశ్వాసాన్ని ఒప్పుకోవాలి, బాప్తిస్మమందు ఆయనతో కూడ పాతిపెట్టబడి ఆయనతోకూడ లేపబడాలి (అపొ. 2:38; కొలస్సీ. 2:12). మనము వెలుగులో నడుస్తూ, మన పాపములను ఒప్పుకొంటూ ఉన్నట్టయితే, ఆయన రక్తము మనలను శుద్ధులనుగా చేస్తూ ఉంటుంది (అపొ. 8:22; 1 యోహాను 1:7–9). క్రొత్త నిబంధన క్రింద వేరేవిధమైన మూలము పాపక్షమాపణ కొరకు అనుగ్రహింపబడలేదు.

---

సూచనలు

[1]Robert Lowry, "Nothing But the Blood," అనే విశ్వాసము, స్తుతిని తెలిపే పాట. పోల్చి ప్రచురింపబడింది, comp. and ed. Alton H. Howard (West Monroe, La.: Howard Publishing Co., 1994).

## సిలువ మీద నేరస్థుడు రక్షింపబడిన సంఘటన

ప్రభువైన యేసుతోకూడ సిలువ వేయబడిన యిద్దరు నేరస్థులలో ఒకడు బాప్తిస్మం లేకుండ రక్షింపబడ్డాడని వారు నమ్ముతున్నందున, క్రొత్త నిబంధన యొక్క విదితమైన ఉపదేశాన్ని అనేకులు నిరాకరిస్తారు. క్రొత్త నిబంధన క్రింద రక్షింపబడినవారికి అతడు ఆదర్శం కాదు. దేవునితో సమాధానపరచడానికి అతడు ధర్మశాస్త్రాన్ని గాని లేక యిటు క్రొత్త నిబంధన ఆవశ్యకతలనుగాని నెరవేర్చినవాడు కాదు.

భూమిమీద ఉండగా, ఆయన ఎప్పుడు కోరుకున్నా, తనకు నచ్చిన ఏ పరిస్థితుల లోనైనా ప్రభువైన యేసు పాపాలను ఉచితంగా క్షమించాడు. ఉదాహరణకు, పక్షవాయువు గలవానియొక్కయు (మత్తయి 9:2-8; మార్కు 2:3-12; లూకా 5:17-26) తన పాదములను కన్నీళ్లతో కడిగిన స్త్రీ (లూకా 7:44-50) యొక్కయు పాపములను ఆయన క్షమించాడు. ఆ వ్యక్తులకు విశ్వాసముంది. క్షమింపబడడానికి మనకు ఉండవలసిన విశ్వాసం వారికి లేకుండపోయింది. మన విశ్వాసము ప్రభువైన యేసు రక్తంలో ఉండాలి (రోమా 3:25), ఆయన పునరుత్థానంలో ఉండాలి (రోమా 10:9). సిలువ మీద ఆ నేరస్థునివలెనే, అటు ధర్మశాస్త్రము యొక్కయు లేక ప్రభువైన యేసునందలి క్రొత్త నిబంధన యొక్కయు ఆవశ్యకతలకు లోబడకుండగనే ఆ ప్రజలు క్షమించబడ్డారు.

ప్రభువైన యేసు ఎవరిని క్షమించాడో వారందరు క్రొత్త నిబంధన అమలులోనికి రాకముందే మరణించారు. సమస్త జనములలో ఆయన పేరట మారుమనస్సును పాపక్షమాపణయు యింకను అప్పటికి ప్రకటింపబడలేదు (లూకా 24:47). ఆ కారణాన్ని బట్టి, రక్షింపబడడానికి గాను అవసరమైన క్రొత్త నిబంధన షరతులకు ఈ వ్యక్తులు లోబడకపోయి ఉండవచ్చు. యేసు క్రీస్తు నామమున పాపక్షమాపణ తొలిగా ప్రకటించిన పేతురు, "-మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు" అని ప్రజలతో చెప్పాడు (అపొ. 2:38). అపొస్తలుల కార్య గ్రంథమంతటిలో, సువార్తకు లోబడినవారందరు స్థిరంగా, పేతురుచేత ఆజ్ఞాపింపబడినదానికి విధేయు లయ్యారు (అపొ. 2:41; 8:12, 36-39; 9:18; 10:47, 48; 16:15, 33; 18:8). క్షమింపబడడానికి సువార్తకు ఎలా లోబడాలో మనకు మాదిరిగా ఉన్నది ఈ వ్యక్తులే గాని, సిలువపైనున్న నేరస్థుడు కాదు. మార్కు 16:16లో ప్రభువు బోధించిన విధంగా, ప్రభువైన యేసు రక్తంతో ప్రతిష్ఠింపబడిన క్రొత్త నిబంధనకు వారు లోబడ్డారు: " 'నమ్మి బాప్తిస్మం పొందినవాడు రక్షింపబడును; నమ్మనివానికి శిక్ష విధింపబడును.' "

## ఏ యుగంలో మనమున్నాం?

మత సంబంధమైన గుంపులన్నిటిలో "యుగాలను గూర్చిన" ఒక గుంపు యొక్క బోధ దాదాపు తక్కిన గుంపులన్నిటి బోధకంటె వ్యత్యాసంగా ఉంటుంది. యూదులకు అపొస్తలుడైన పేతురు యూదుల యుగంలో రక్షణ క్రియలను గూర్చి బోధించాడని వారు ఉపదేశిస్తారు. ఈ యుగంలో పాపక్షమాపణ కొరకును రక్షణ కొరకును దేవుడు బాప్తిస్మం కోరినట్టు వారు చెప్పుతారు (అపొ. 2:38; 22:16; 1 పేతురు 3:21). కొర్నేలీయొక్క స్నేహితులును అతని యింటివారును సంఘంలోనికి తేబడినప్పుడు ఈ యుగం అంతమౌతుందని వారంటారు. ఈ యుగ సంబంధమైన బోధ ప్రకారము, అన్యజనుల్లోనుండి తొలిగా క్రైస్తవులైనవారు కూడా విశ్వాసం ద్వారా మాత్రమే రక్షణ అనే కృపా యుగానికి తొలిగా మార్పు పొందినవారట. (పౌలు యొక్క పరిచర్య క్రొత్త యుగాన్ని పరిచయం చేసినట్లు చెప్పబడుతుంది.) నేడు ప్రజలందరు ఈ యుగంలోనే ఉన్నట్టు వారంటారు క్రైస్తవ యుగాన్ని వీరు రెండు యుగాలుగా విభాగిస్తారు.

ఈలాటి ఆలోచన లేఖనాలను ఉల్లంఘిస్తుంది. క్రొత్త నిబంధన క్రీస్తు మరణంతో ఆరంభమౌతుందని హెబ్రీ. 9:16, 17 బోధిస్తుంది. మరియు యెరూషలేము మొదలుకొని ఆయన పేరట ప్రకటింపబడడం ఆరంభించబడింది (లూకా 24:47). సువార్త సందేశం మొదటిగా పెంతెకొస్తు దినాన ప్రకటింపబడింది (అపొ. 2). యూదులు అన్యజనులనే (అపొ. 15:8, 9) వారి మధ్య దేవుడు ఏ భేదము కనుపరచలేదనియు, యూదులు "ప్రభువైన యేసు కృపచేత రక్షణ పొందుతున్నట్టే, వారును [అన్యజనులు] రక్షణ పొందుదురు" (అపొ. 15:11) అని పేతురు చేసిన ప్రతిపాదనలు – ఈ యుగ సంబంధమైన వాదులను అర్థ రహితంగా చేస్తున్నాయి.

పౌలు ప్రకటించిన సువార్త తాను క్రైస్తవుడు కాకముందు ప్రకటింపబడిన సూవార్తకు భిన్నమయ్యింది కాదు. పైగా, "తాను పూర్వము పాడు చేయుచు వచ్చిన విశ్వాసమునే ప్రకటించుచున్నాడు" (గలతీ. 1:23బి). యూదులు, అన్యజనులు క్రీస్తులోనికి బాప్తిస్మం పొందినప్పుడు వారందరు ఆయనను ధరించుకొన్నవారై, క్రీస్తు శరీరమనే ఒకే శరీరంలోనికి వారు ప్రవేశిస్తారు (గలతీ. 3:27, 28).